

# గోదారి



**2041**వ సంవత్సరం...

తెల్లవారుజామున నాలుగు గంటల సమయం...

శుభోదయాన్ని సూచిస్తూ మోగిన ఫోన్ శబ్దం విని ఉలికిపడి లేచాడు కృష్ణమోహన్.

ఫోన్ రిసీవర్ అందుకున్నాడు బద్ధకంగా.

వార్త వింటూనే హతాశయుడై మంచం దిగుదామని నేలమీద కాళ్లు పెట్టే సరికి నేలంతటినీ తడుపుతూ సన్నని నీటిపొర.

గబగబా భార్య ప్రియంవదనీ, పిల్లలిద్దరినీ, తల్లినీ లేపాడు.

"ప్రియా! ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది. అపుడే గంట నుంచీ ట్రై చేస్తున్నారట. గోదావరి ఊళ్లో ప్రవేశించిందట. నిన్న రాత్రివరకూ ఎటువంటి సూచనా లేదు. ఎక్కడా వాన కురిసిన దాఖలాలు లేవు. అటు రాజమండ్రి, ఇటు కొవ్వూరు గట్లు దాటి ఊళ్లలోకి ప్రవహిస్తోందట. నేను వెళ్తాను. వీలైతే అటెండర్ని పంపిస్తాను. లేకుంటే వక్కంటి వారి సాయంతో ఇంటికి తాళంవేసి, ఎత్తైన ప్రదేశానికి చేరుకోండి! ఊఁ క్విక్!' అతని మాట పూర్తికాకుండానే వాకిట్లో జీప్ హారన్ వినిపించింది.

"వస్తాను ప్రియా! మీరంతా జాగ్రత్త!" అతను కదలబోయాడు.

"డాడీ!" అంటూ పిల్లలు అతన్ని కరుచుకుపోయారు.

"మరేం భయంలేదమ్మా! ఇదేమీ వరద ప్రభావం మాత్రంకాదు. మీరేం భయపడద్దు. ఏం జరగదు. మీరు ధైర్యంగా ఉండి అమ్మకి, బామ్మకి సాయంగా ఉండండి! నేను వెళ్లిన వెంటనే ఫోన్ చేస్తాను. అటెండర్ని పంపిస్తాను సరేనా!"

ఆగలేనట్టు విసుగ్గా జీప్ హారన్ మళ్లీ మోగడంతో ఒక్క ఉదుటున వెళ్ళి జీప్లో కూలబడ్డాడు కృష్ణమోహన్!

ఎంత ధైర్యం చిక్కబట్టుకున్నా వారు నలుగురూ ఒకరినొకరు కరుచుకుపోయి బేలగా, వెళ్తున్న జీప్వైపే చూస్తుండిపోయారు.

ఆ గదిలో గోదావరి గలగలా కిలకిలా నవ్వుతోంది పలుచగా!

***

కృష్ణమోహన్ ఆఫీసుకు చేరుకున్న వెంటనే మొత్తం రాష్ట్ర సమాచార వ్యవస్థను అరగంటలో అప్రమత్తం చేశాడు. తన పై అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శికి,

నీటిపారుదలశాఖ అధికారులకి, రాష్ట్రమంత్రులకు, అందరికీ సమాచారం క్షణాల్లో అందించి అత్యవసర సమయంలో సహాయక చర్యలను చేపట్టేందుకు పోలీసుశాఖ సిబ్బందికి, స్థానిక సంస్థలకు, కలెక్టర్ తరపున ఆయన అనుమతితో సమాచారం అందించి రంగం సిద్ధం చేశాడు.

ఇంతా చేస్తూనే అతను అనుక్షణం ప్రాజెక్టులో వాటర్ లెవల్ గమనిస్తూనే ఉన్నాడు.

అరగంట తరువాత ముఖ్యమంత్రి లైన్లోకి వచ్చాడు. ఆందోళనగా పరిస్థితిని గురించి కృష్ణమోహన్‌తో సమీక్షించాడు.

"గుడ్‌మార్నింగ్ సర్! రాత్రి ఇక్కడ వాతావరణం అంతా పొడిగా ఉంది. శీతకాలం కూడా వెళ్లి వేసవికాలం ప్రవేశిస్తున్న ఈ రోజుల్లో వేసవి గడవడానికి అవసరమైన నీటిని మాత్రమే ఉంచి అదనపు నీటిని వదిలివేశాం. అయితే నీరు లోతట్టు ప్రాంతాల్లో కూడా కేవలం ఒక అడుగు మేర మాత్రమే ప్రవేశించింది. ఆపై నీటి పెరుగుదల ప్రస్తుతం ఆగిపోయింది. ముఖ్యంగా రాజమండ్రి - కొవ్వూరుల మధ్య పాతరైలు వంతెన - కొత్త రైలు - కం - రోడ్ వంతెనల మధ్య ప్రాంతంలోని ఊర్లలోకి నీరు ప్రవేశించింది. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిమట్టం పెరగక, నిలకడగా ఉంది. ఇక్కడ అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితి ఎప్పటికప్పుడు మీకు తెలియజేస్తాను. ఉంటాను సార్! నమస్తే!"

"వన్‌మినిట్ మిస్టర్! రెండు మూడు గేట్లు లాకుల వద్ద ఎత్తేస్తే?" ముఖ్యమంత్రి ప్రశ్నించాడు.

"నో సర్! ఒక్క గేటు ఎత్తివేసినా కొన్నివేల క్యూసెక్కుల నీరు దిగువకు పోతుంది. ఆ నీరు వృథా అయితే వేసవిలో నీటి ఎద్దడి వచ్చి ప్రజలనుంచి వ్యతిరేకత ఏర్పడవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యమైనంతవరకూ నీటిని వదలకుండా, ప్రజలకు ప్రాణ ప్రమాదం లేకుండా ఇక్కడ అందరితో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టి మీకు తెలియజేస్తాను సార్! ఉంటాను నమస్తే!" కృష్ణమోహన్ ఫోన్ పెట్టేసి నుదుట పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

అటెండర్ మంగయ్య లోపలి కొచ్చాడు.

"మంగయ్యా! ఏమిటి కొత్త సమాచారం!"

"భూగర్భ పరిశోధనా విభాగంవారు, మన స్టాఫ్, పోలీసుశాఖ వారు అందరూ మీటింగ్ హాల్లో రెడీగా ఉన్నారు సార్! మీరు రావడమే తరువాయి!"

"చూడు! వాచ్‌మెన్ వెంకటేశంను మా ఇంటికి వెళ్లి అమ్మగారికి సహాయం ఉండమను. నువు నాతో రా!" అతన్ని తన ఎదురుగా ఉన్న ఫైల్సు తీసుకోమని సైగచేసి కృష్ణమోహన్ ముందుకు నడిచాడు.

మంగయ్య అనుసరించాడు.

★★★

కృష్ణమోహన్ ధవళేశ్వరం ప్రాజెక్టులో ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్నాడు. అతను అక్కడకు ట్రాన్స్ఫరై వచ్చిన ఈ పది సంవత్సరాల్లో గోదావరి పుష్కరాలు ఎంతో ఘనంగా ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలుగని అసాధారణ రీతిలో నిర్వహించి రాష్ట్రప్రభుత్వ ప్రశంసలందుకున్నవాడు. సమయస్ఫూర్తి, చాకచక్యం, ఆలోచిస్తూనే చొరవగా తన సిబ్బందిని నడిపించే సామర్థ్యంగల చక్కటి అధికారిగా పేరు తెచ్చుకున్నాడు.

2036 సంవత్సరంలో కనీవినీ ఎరుగని వరద వచ్చి ఆ ప్రకృతి వైపరీత్యంలో సుమారు పదివేలమంది ప్రాణాలు కోల్పోయి, ఏభైవేలమంది నిరాశ్రయులైనారు. ఆ సమయంలో అతను చూపిన కార్యనిర్వహణాదక్షత యువత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైంది.

సత్యసాయి సంస్థలు మొదలుకొని ఎన్నో యువజన సంస్థలు తమ ఆర్థిక సహాయాన్ని ప్రకటించడమే కాక ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టాయి. నేత్ర పరీక్షలు, పూర్తి ఆరోగ్య పరీక్షలు, నిరాశ్రయు లకు ఆహార పొట్లాలు, బియ్యం, దుప్పట్లు, మందులు, పాతబట్టలు అన్నీ... ఎంతో శ్రమకోర్చి ప్రతీ ఒక్కరికీ అందేలా ఆ సంస్థలు పనిచేయగలిగాయంటే వాటి కార్యదీక్షకు స్ఫూర్తి కృష్ణమోహనే!

అతని కీర్తి ప్రతిష్టలు భరించలేని ఓ మాజీ రాజకీయ నాయకుడు ఉన్నవీ లేనివీ చెప్పి తన నియోజకవర్గ ప్రజలను రెచ్చగొట్టి అతన్ని తక్షణం అక్కడినుంచి ట్రాన్స్ఫర్ చేయమని కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తే ..."ర ప్రజలే కాదు, చుట్టుపక్కల గ్రామాల జనాలు కూడా ఏకతాటిమీద నిలిచి ఆ రాజకీయ నాయకుడిచేత ప్రజాసమక్షంలో కలెక్టరేట్ ఎదుట బహిరంగంగా క్షమాపణ చెప్పించడంలో కృతకృత్యులయ్యారంటే కృష్ణమోహన్ ఎంతగా ప్రజాభిమానాన్ని చూరగొన్నదీ అర్థంచేసుకోవచ్చు.

తీగ లాగితే డొంకంతా కదిలినట్టుగా ఆ రాజకీయ నాయకుడి గూండా నేరచరిత్ర అంతా కూకటివేళ్లతో సహా పెకలించి అతన్ని రాజకీయ సన్యాసం చేయించేటంతవరకూ పత్రికలు తమ పత్రికా స్వాతంత్ర్యాన్ని స్వేచ్ఛగా వినియోగించుకున్నాయి. ఆ తరువాత అతను పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు గ్రహించి సద్దుమణిగాయి.

అంతగా ప్రజామద్దతు కూడగట్టు కున్న అధికారి కృష్ణమోహన్. అందుకే అతని ప్రత్యక్షంలో లేచి నిలబడి గౌరవిస్తారు. పరోక్షంలో హృదయ పూర్వకంగా నమస్కరిస్తారు.

కృష్ణమోహన్ మీటింగ్ హాల్లోకి అడుగుపెట్టేసరికి అందరూ గౌరవసూచకంగా నిలబడ్డారు.

"థాంక్యూ అండ్ వెల్‌కమ్ ఆల్ ఆఫ్ మై

ఫ్రెండ్స్. ముందుగా ఈ మీటింగ్‌కు హాజరైన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక నమస్కారాలు తెలియ జేస్తున్నాను. మనం ఎంతో అప్రమత్తంగా వ్యవహరించవలసిన సమయం మళ్లీ ఆసన్నమైంది. ముందుగా వాటెబౌట్ వాటర్ లెవెల్? మిస్టర్ కృష్ణమూర్తి!" అడిగాడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమూర్తిని.

''సరిగ్గా నాలుగు గంటలకు ఏ పొజిషన్‌లో ఉందో ఇప్పుడూ అదే పొజిషన్‌లో ఉంది సార్! భద్రాచలం, పాపికొండలు, పోలవరంలలో అంతటా వాతావరణం పొడిగా ఉంది సార్! పోలవరం ప్రాజెక్టులో కూడా వాటర్ సరిగ్గా ఉండవలసినంత ఉంది సార్! బొంబాయి వాతావరణ పరిశోధన కేంద్రం దగ్గర నుంచి కూడా సమాచారం వచ్చింది సార్! ఎక్కడా వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. రేపు సాయంత్రం వరకూ వాతావరణం పొడిగా ఉంటుందని మెసేజీ పంపారు సార్!''

"ఓకే! థాంక్యూ ఫర్ యువర్ అటెన్షన్ మిస్టర్ కృష్ణమూర్తి. కీపిటప్!" అని భూగర్భ పరిశోధకులకేసి తిరిగి అడిగాడు కృష్ణమోహన్.

"మిస్టర్ దీపక్ భాటియా! భూమి లోపల ఏమైనా మార్పులు జరుగుతున్నాయంటారా! ఐమీన్ భూకంపం వచ్చే అవకాశం గానీ... మరేదైనా?''

"నో సర్! సిస్మోగ్రాఫిక్ సెంటర్ వారి సమాచారం మేరకు అటువంటి అవకాశం ఏదీ లేదు సార్! అంతా సవ్యంగా ఉంది''.

కృష్ణమోహన్ నవ్వాడు!

''ఓకే! థ్యాంక్యూ ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్. మరి ఈ అనుకోని అవాంతరానికి కారణం? మరోసారి ఆలోచించండి!''

చేతిలో పెన్నును నుదుటికి తాకిస్తూ సాలోచనగా ఉన్న కృష్ణమోహన్ ముందు అటెండర్ మంగయ్య గాజుగ్లాసులో సగం వాటర్ పోసి దానిలో పచ్చని అందమైన గుండ్రని నిమ్మకాయ వేశాడు. నీరు సరిగ్గా గ్లాసు అంచుల వరకూ వచ్చి ఆగిపోయింది. దానిపై ప్లాస్టిక్ వాచ్ గ్లాస్ మూతవేసి వెళ్లిపోయాడు.

సరిగ్గా అప్పుడు గుర్తుకు వచ్చింది అతనికి బామ్మ చెప్పిన కథ. వెంటనే దీపక్ భాటియాతో అన్నాడు.

''మిస్టర్ దీపక్! మీరు వెంటనే హెలికాప్టర్‌లో వెళ్లి గోదావరి బ్రిడ్జిల రెండింటి మధ్యగల నీటి కింద ఉండే ఇసుకని తీసుకురండి. మీకు అవసరమైనవారిని తీసుకెళ్లండి. క్విక్. ముఖ్యంగా బ్రిడ్జికి ఆ పక్కనగాని, ఈ పక్కనగానీ సమీపంలోగల ఇసుక అయితే మరీ మంచిది. జాగ్రత్త! రోప్స్, బకెట్స్, బ్యాగ్స్ అవసరమైనవన్నీ పట్టుకెళ్లండి! క్విక్!''

అన్నదే తడవుగా దీపక్ భాటియా తనకు

అవసరమైన సిబ్బందితో నిష్క్రమించాడు.

దాదాపు అరగంట తర్వాత -

అతనికి ఎదురుగా బ్యాగ్‌లో తడిసిన ఇసుకను ఉంచారు. దానిని ఆదుర్దాగా ఆతృతగా పరిశీలించిన కృష్ణమోహన్ దీపక్ భాటాయాని అడిగాడు.

"దీపక్! వెంటనే ఈ శాంపిల్‌ని టెస్టింగ్‌కి పంపించి రిపోర్ట్ తెప్పించండి. క్విక్! గంటలో రిపోర్టు నా టేబుల్ మీద ఉండాలి!"

"ఓకే సార్!" అంటూ దీపక్ గంట పూర్తికాకముందే తిరిగి వచ్చాడు రిపోర్ట్‌తో సహా!

నేచురల్ గ్యాస్ - నిల్

ఆయిల్ - నిల్ అని ఉంది!

మిగతా వివరాలు చదివాడుగానీ అవి అంతగా అవసరం లేనివి!

"మిస్టర్ దీపక్! ఆర్‌యూ ష్యూర్ ఎబౌట్ దిస్ రిపోర్ట్" ప్రశ్నించాడు కృష్ణమోహన్.

"యస్సర్! అన్నట్టు ఇందాక తీసుకెళ్లిన శాంపిల్‌లో మూడోవంతు ఇవే ఉన్నాయి సార్!" అంటూ మంగయ్యకు సైగ చేశాడు దీపక్!

మంగయ్య బాగా బరువుగా ఉన్న ఓ సంచీ మూత విప్పి కృష్ణమోహన్ ముందు టేబుల్‌పై కుమ్మరించాడు.

అవన్నీ చిల్లర నాణాలు పాతవి, కొత్తవి, రాగివి, అయిదు పైసల నుండి అయిదు రూపాయల నాణెం వరకూ అన్ని రకాలూ ఉన్నాయి!

దీర్ఘంగా లోపలికి శ్వాస పీల్చి తిరిగి విడుస్తూ తల వెనుక చేతులు పెట్టుకుని అన్నాడు కృష్ణమోహన్!

"అర్థమైంది భాటియా! మిస్టర్ కృష్ణమూర్తీ! ఈ సమస్యకు పరిష్కారం దొరికింది. మీరు అత్యవసరంగా చెయ్యాల్సిన పనేమిటంటే మన నగరంలో సుమారు ఇరవై వాటర్ రిజర్వాయర్స్ ఉన్నాయి. వెంటనే అన్ని రిజర్వాయర్స్‌ని వాటర్‌తో రీఫిల్ చెయ్యమనండి. గోదావరి మట్టం ఇక పెరగదు. ప్రజలందరికీ వాటర్ ప్యూరిఫయింగ్ యాపరేటస్ కుటుంబానికి ఒకటి పంచిపెట్టమనండి. నీరు కాచుకు తాగమనండి. గోదావరిపైనున్న రెండు బ్రిడ్జిలకు అటూ ఇటూ పూడిక తీయించే ఏర్పాట్లు చెయ్యండి. మీకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకుని నన్ను కాంటాక్ట్ చెయ్యండి!" అంటూ కృష్ణమూర్తికి ఆజ్ఞలు జారీ చేశాడు కృష్ణమోహన్.

కృష్ణమూర్తి "థాంక్యూ సర్. చాలా తేలికగా సమస్యకు పరిష్కారం కనుక్కున్నారు" అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చి కదలబోయాడు.

"మిస్టర్ కృష్ణమూర్తి. గోదారి ఇసుకలో దొరికిన ప్రతీ నాణెమూ కూడా ప్రభుత్వ ఖజానాకు జమ కావాలి. టేక్ కేర్ ఎబౌట్ ఇట్."

"థాంక్యూ సార్. ఓకే." అంటూ కృష్ణమూర్తి వెళ్లిపోయాడు.

"మాకేం అర్థం కాలేదు సార్!" అన్నాడు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్.

"దీన్లో అర్థం కానిదేముంది సార్? ఇటు చూడండి..." అంటూ గాజు గ్లాసు, మూత తీసి అందులోని నిమ్మకాయ జాగ్రత్తగా పైకి తీశాడు.

"ఇప్పుడు గ్లాసులో నీరు ఎలా ఉంది?"

"సగానికి"

నిమ్మకాయ అందులో వేశాడు కృష్ణమోహన్.

"ఇప్పుడు?"

"అంచులదాకా వచ్చింది".

"ఇందులో మరో గోళాకాయ వేస్తే?"

"నీరు పొర్లిపోతుంది."

"ఇప్పుడు జరిగిందీ అదే."

"అబ్బే! అర్థం కాలేదు సార్."

"మీకు కాకి - కడవలో నీళ్ళ కథ తెలుసా?"

"తెలీదు సార్."

"పోనీ పంచతంత్ర కథలు తెలుసా?"

"పేరు విన్నాంగానీ చదవలేదు సార్?"

"వేమన, సుమతీ శతకాల పేర్లయినా విన్నారా?"

"లేదు సార్! ఎల్.కె.జీ.లో ఏ ముహూర్తంలో చేరామో చదువు పూర్తయ్యే వరకూ గుండెతోపాటు సమానంగా శ్రమించి ఈ ఉద్యోగం సంపాదించి స్థిరపడ్డాం గానీ మాకు బాల్యమే జ్ఞాపకం లేదు. భవిష్యత్తు ఉనికి కోసం బాల్యాన్ని పారవేసుకున్న వాళ్ళం మేము. మీరు చెప్పిన శతకాలు గానీ, కథలు గానీ మేమెప్పుడూ చదవలేదు. ఎవరైనా పెద్దలు తమ ప్రసంగాల్లో చెబుతుంటే విన్నామంతే. పోటీ పరీక్షలు, జి.కె.టెస్ట్‌లు, ర్యాంకులు సాధించడం, ఉద్యోగం కోసం పోరాటాలు... వీటితోటే జీవితం యజ్ఞంలా మారి బతుకుల్ని సమిధలు చేసి బతుకు తున్న వాళ్ళం. నాకే కాదు ఈనాటి యువ తరం ఎవరికీ మీరన్నవి తెలీనే తెలీదు. చెప్పండి సార్! ఈ వేళయినా ఆ కథ చెప్పండి". అన్నాడు రణధీర్, సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీస్.

"ఒక కాకికి దాహమై నీటి కోసం వెతుకుతోందట. దానికి నీళ్ళ ఉన్న కుండ కనిపించిందట. కానీ నీళ్ళ అడుగున ఉన్నాయట. అప్పుడు కాకి గులకరాళ్ళు తెచ్చి ఆ కుండలో వేసిందట. అప్పుడు నీరు పైకి వచ్చాక తాగి తన దాహం తీర్చుకుందట. మా బామ్మ ఈ కథ చెప్పింది. అంతేకాదు, పంచతంత్ర కథలన్నీ నేను చదివాను కూడా.

యికఅసలుసంగతి. రోజూ వైజాగ్ నుంచి విజయవాడ వరకూ కొన్ని వేల మంది ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తున్నారు. రైలు బ్రిడ్జి మీదకు వచ్చేసరికి తమకు తోచిన చిల్లర, నీళ్లలోకి విసిరి గోదారి తల్లికి నమస్కరించుకుంటారు. ఇది ఈనాటిది కాదు. నూట యాభై సంవత్సరాలుగా జరుగుతోంది. దేనికైనా ఒక హద్దు ఉంటుంది కదా! గోదావరి నిండా ఈ చిల్లర

నాణాలు ఎక్కువై కాకి కథలోలా సరిగ్గా నిన్న రాత్రికి - గ్లాసు నిండి బయటకు వచ్చేసిన నీటిలా, గోదారి నీరు కూడా పొంగి పొర్లి గట్లు దాటి ఊరిలో ప్రవేశించింది. అంతే తప్ప ఇందులో మరేం లేదు" అన్నాడు కృష్ణమోహన్ నవ్వుతూ గోదారిలా.

★★★

**పరిహారం...**

"రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల సొమ్మును జమచేసే మార్గాంతరం కనుగొన్నందుకే కాదు, చిల్లర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమాజాన్ని ఆ సంక్షోభం నుంచి రక్షించినందుకూ, ఎప్పటికప్పుడు టీవీ మీడియా ద్వారా తనదైన శైలిలో ధైర్యవచనాలు తెలియచేసి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కృతకృత్యుడైనందుకూ రాష్ట్రప్రభుత్వం కృష్ణమోహన్‌కు 'నిత్యకృషీవలుడు' అన్న ప్రత్యేక ప్రశంసతో గౌరవించి సత్కరించింది."

అంతేకాదు, ఆ సంవత్సరం నుంచి ప్రాథమిక విద్యాస్థాయిలో పంచతంత్ర కథలు, వేమన, సుమతీ శతకాలు నిర్బంధ పఠనాంశాలుగా సిలబస్‌లో చేర్చుతున్నట్లు ప్రకటించింది.

తమ భక్తితో తనను పక్కదారి పట్టించబోయిన ప్రజలను చూసి గోదారి నవ్వుతూనే ప్రవహిస్తోంది. ప్రవహిస్తూనే నవ్వుతోంది. ●

'ఈనాడు ఆదివారం'
10-11-2002